క్లుప్తంగా

13న రైతు ర్యాలీ

ఒంగోలు సిటీ: ఈ నెల 13న జరగనున్న రైతు ర్యాలీ జయప్రదం చేయాలని ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నదాతలకు అండగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉందన్నారు. కూటమి ప్రభుత్వం రైతులను నిట్టనిలువునా మోసం చేసిందని విమర్శించారు. పెట్టుబడి సాయం కింద తక్షణమే రైతుకు రూ.20 వేలు చెల్లించాలని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని.. ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలని, దళారీ వ్యవస్థ తొలగించాలని డిమాండ్ చేశారు. తేమ లెక్కలతో రైతులను ఇబ్బంది పెట్టడం మానుకోవాలన్నారు. ఉచిత పంటల బీమా వెంటనే పునరుద్ధరించాలని కోరారు. రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఈ నెల 13న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగే రైతు ర్యాలీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ కమిషన్‌కు వినతులు పంపవచ్చు

ఒంగోలు వన్‌టౌన్: షెడ్యూల్డు కులాలను ఉప వర్గీకరణపై విచారణ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏక సభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రాను నియమించిందని.. ఈ విషయంపై ప్రజల నుంచి రాతపూర్వక వినతులు ఉంటే తెలుపవచ్చని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. లక్ష్మానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత దేశ అత్యున్నత న్యాయస్థానంలో, వెలువరించిన తీర్పును అనుసరించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వర్గీకరణపై విచారణ చేయడానికి ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కమిషన్ విజయవాడ మొఘల్రాజపురంలోని గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయం మొదటి అంతస్తులో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిషన్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల 30 నిమిషాల వరకు పని చేస్తుందన్నారు. వ్యక్తిగతంగా నైనా, రసీదుతో కూడిన రిజిస్టర్ పోస్టు ద్వారా అయినా జనవరి 9వ తేదీ లోపు తమ అభిప్రాయాలను తెలుపవచ్చన్నారు. మెయిల్ ఐడీకి కుడా పంపవచ్చని తెలిపారు.

పాస్టర్‌ను కఠినంగా శిక్షించాలి

ఒంగోలు వన్‌టౌన్: నెల్లూరు జిల్లా, ఆదూరుపల్లిలో గిరిజన బాలిక మృతికి కారణమైన చర్చి పాస్టర్‌ను కఠినంగా శిక్షించాలని హేతువాద సంఘం జాతీయ అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 8 సంవత్సరాల గిరిజన బాలిక అనారోగ్యంతో బాధపడుతుండగా తాను ప్రార్థనలతో స్వస్థపరుస్తానని చెప్పి ఆదూరు పల్లికి చెందిన పాస్టర్ నెలరోజుల పాటు చర్చిలోని ఉంచడంతో బాలిక మృతి చెందిదన్నారు.

అన్నదాత సుఖీభవ ఎక్కడ?



చీమలమర్రి ప్రాంతంలో సాగులో ఉన్న వరి



పదమటి నాయుడుపాలెంలో వేసిన మిర్చి పంట

- కూటమి ప్రభుత్వంపై రైతుల మండిపాటు

చీమకుర్తి రూరల్:

అధికారంలోకి వచ్చాక అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏటా రూ.20 వేలు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని మాట ఇచ్చిన కూటమి సర్కార్ ఆ హామీని ఇంతవరకూ నెరవేర్చలేదు. రైతులపై అదనంగా ఇన్సూరెన్స్ ప్రీమియం భారం మోపేందుకు సిద్ధమైంది. రైతులకు రబీ సీజన్ నుంచి ప్రభుత్వం భారీ షాక్లు ఇస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకుంది. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం పేరుతో పరిహారం అందించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ పథకానికి తూట్లు పొడుస్తోంది. ఇకపై తుఫాన్, ఇతర ప్రకృతి వైపరీత్యాల సమయంలో బీమా అందాలంటే నోటిఫైడ్ చేసిన పంటలకు సంబంధించిన బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించుకోవాలని ప్రకటన చేసింది. దీంతో రైతన్నలు కూటమి సర్కార్‌పై మండిపడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉచిత బీమా అమలు చేశారు. ఏటా ప్రకృతి విపత్తుల నుంచి రైతులు నష్టపోతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నదాతల కోసం విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. ఈ–క్రాప్ విధానంతో ప్రతీ రైతు వివరాలు నమోదు చేసి వారికి ఉచితంగా పంటల బీమా వర్తింపజేశారు. వరికి రూ.600 బీమా ప్రీమియం చెల్లించాలి. ఆ మొత్తం గత ప్రభుత్వమే చెల్లించేది. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బీమా విషయంలో ధీమాగా ఉండేవారు. దీనికి తోడు పెట్టుబడి సాయం కింద ఏటా రైతుల ఖాతాలో రూ.13,500 నగదు జమ చేశారు.

ప్రీమియం తప్పనిసరిగా కట్టాలి

వేరుశనగ, మొక్కజొన్న, మినుము, పచ్చిపప్పు పంటలు సాగు చేసిన రైతులు ఈ నెల 15వ తేదీలోపు, వరి డిసెంబర్ 31వ తేదీలోపు బీమా ప్రీమియం చెల్లించాలని చీమకుర్తి మండల వ్యవసాయాధికారి డీవీ భాస్కర్ తెలియజేశారు.

ఈ నెల 15వ తేదీ తుది గడువు

ఈ ఏడాది రబీ సీజన్ నుంచి ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలంటూ కూటమి ప్రభుత్వం మరోమారు రైతులకు ఇబ్బంది పెట్టేందుకు సిద్ధమైంది. ప్రీమియం చెల్లించేందుకు డిసెంబర్ 15వ తేదీ తుది గడువు విధించింది. రుణాలను రెన్యువల్ చేసుకుంటే తప్ప.. ప్రీమియం కట్టించుకోమని బ్యాంకర్లు చెబుతుండటంతో రుణాలు చెల్లింపు రైతులకు భారంగా మారింది. అసలే అప్పులు చేసి పంటలు సాగు చేశాం.. ఇప్పుడు రుణాలను ఎలా రెన్యువల్ చేయగలమని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్ణయం వెనక్కు తీసుకోవాలి



వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని రద్దు చేసే నిర్ణయాన్ని తక్షణమే కూటమి ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలి. గత ప్రభుత్వంలో ఆ పథకంతో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండింది. ఇప్పుడు రైతులే ప్రీమియం చెల్లించుకోవాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రైతులకు భారం కానున్న ఇటువంటి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

జడా రాజు, రైతు, చీమలమర్రి

ప్రీమియం చెల్లింపు అదనపు భారం:



గత ఐదేళ్ల పంటల సాగుకు ముందే పెట్టుబడి నిధి అందుకున్న రైతులకు ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఆ సాయం అందకుండా పోయింది. దీంతో అప్పులు చేసి పంట సాగు చేపట్టాం. ఇన్సూరెన్సు ప్రీమియం కూడా గత ప్రభుత్వమే చెల్లించింది. కూటమి ప్రభుత్వం రైతులనే కట్టమంటోంది. అసలే ఇబ్బందుల్లో ఉన్న రైతులకు ఇప్పుడు ప్రీమియం చెల్లింపు అనేది అదనపు భారంగా మారింది.

మన్నుబ్రోలు ఏడుకొండలు, రైతు, ఇలపావులూరు

దివ్యాంగుల సాధికారతే ధ్యేయం



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న పీడీ రవికుమార్, మేయర్ సుజాత తదితరులు

ఒంగోలు సబర్బన్: దివ్యాంగ జన సాధికారితే ప్రధాన ధ్యేయంగా మెప్మా పనిచేస్తునందని జిల్లా మెప్మా పీడీ తేళ్ళ రవికుమార్ అన్నారు. ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం–మానవ హక్కుల దినోత్సవం వేడుకలు మంగళవారం స్థానిక మెప్మా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ రవికుమార్ మాట్లాడుతూ 1948 డిసెంబర్ 10న ఐక్యరాజ్య సమితి – ప్రపంచ మానవ హక్కుల వేదిక సార్వత్రిక ప్రకటన చేసిందని, అందులో భాగంగానే ప్రతి దేశంలో, రాష్ట్రంలో మానవ హక్కుల కమిషన్ ఏర్పాటు అయిందన్నారు. విస్తృతమైన మానవ హక్కుల్లో దివ్యాంగుల హక్కులు కూడా అంతర్భాగమని ప్రాజెక్ట్ డైరెక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ నగర పాలక సంస్థ తీసుకొనే నిర్ణయాల్లో దివ్యాంగులకు సముచిత వాటా తప్పకుండా ఉంటుందని తెలిపారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్యం, భద్రత, పునరావాసం, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సంస్కృతిక, క్రీడా రంగాల్లో సమాన అవకాశాలు అందుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు వారి శాఖల ద్వారా దివ్యాంగుల కోసం అమలు చేస్తున్న పలు పథకాలు గురించి వివరించారు. మెప్మా ద్వారా ఆరు మందికి స్వయం ఉపాధి కోసం రుణాలు, ముగ్గురికి స్వానిధి రుణాల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. దోస్త్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ, మెప్మా సిబ్బంది సమకూర్చిన 75 దుప్పట్లను దివ్యాంగులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ తేళ్ల రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్టెప్–సీఈఓ శ్రీమన్నారాయణ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె. రామచంద్రరావు, ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ రవితేజ యాదవ్, జిల్లా గ్రంథాలయ సెక్రటరీ ఆదిలక్ష్మి, సైకియాలజిస్ట్ ఎస్. ఏడుకొండలు, అర్బన్ జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు జి. భారతి, దోస్త్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా, సిటీ మిషన్ మేనేజర్ జి. కల్పన, టెక్నికల్ ఎక్స్‌పర్టులు ఎన్. జయకుమార్, బీవీ ఫణికుమారి, కె. రాణి, డి. సంతోష్ కుమార్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పీడీ వీనిల్ కుమార్, పలువురు కమ్యూనిటీ ఆర్గనైజర్స్, దివ్యాంగ పొదుపు గ్రూప్ సభ్యులు, నాయకులు పి. బాలు, సులోచన, సురేష్, శ్రీనివాస రెడ్డి, శివకృష్ణా రెడ్డి, రాజా తదితరులు పాల్గొన్నారు.

మానవ జీవితానికి మార్గదర్శి భగవద్గీత



విజేతలతో శ్రీగిరి గిరి ప్రదక్షిణ నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: భగవద్గీత అద్భుత గ్రంథమని శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ అధ్యక్షులు రాధా రమణ గుప్తా జంధ్యం మంగళవారం అన్నారు. నగరంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో భగవద్గీతలోని 12వ అధ్యాయం భక్తి యోగం శ్లోకాల పఠన పోటీల్లో 38 మంది హాజరయ్యారు. వారికి ప్రశంస పత్రం, జ్ఞాపిక అందించారు. త్రిపురం మల్లికార్జున రావు, తూనుగుంట మల్లికార్జున రావు, నేరెళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దాతలకు సన్మానం



దాతలను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

మద్దిపాడు: మండలంలోని బసవన్నపాలెంలో ఏర్పాటు చేసిన హెల్త్ వెల్ నెస్ సెంటర్‌ను అభివృద్ధి చేసేందుకు పలువురు దాతలు ముందుకొచ్చారు. వెల్ నెస్ సెంటర్లో ఎన్ క్వాస్ సర్టిఫికెట్ లభించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్లు శ్రావణ్, జగదీష్, శిరీష, వినీల చౌదరి ఆధ్వర్యంలో దాతలు అబ్బూరి శేషగిరిరావు, గోవిందరాజులు, మండవ లక్ష్మీనారాయణ, కొప్పోలు విశ్వనాథం, పూనాటి చిన్న అప్పారావు, మండవ రంగారావులను మంగళవారం వెల్ నెస్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సన్మానించారు. కార్యక్రమంలో మండవ జయంత్‌బాబు, సర్పంచ్ రవి, వైద్య ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్ బాలకోటయ్య సీహెచ్‌ఓలు రజితకుమారి, లలితమ్మ, ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, వైద్య శాఖ సిబ్బంది పాల్గొని దాతలను అభినందించారు

ప్లాస్టిక్ రహిత పాఠశాలగా మార్చుదాం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంఈఓతో సన్ హెల్పింగ్ సభ్యులు

మద్దిపాడు: పాఠశాలను ప్లాస్టిక్ రహిత పాఠశాలగా తయారు చేసుకుందామని సన్ హెల్పింగ్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ టీఎస్ రావు అన్నారు. సన్ హెల్పింగ్ పీపుల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్ మార్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫౌండేషన్ తరఫున ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచే ప్లాస్టిక్ రహిత సమాజంపై అవగాహన కల్పించే దిశగా తమ సంస్థ కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ కవర్లు, పేపర్ టీ కప్పుల వాడకాన్ని నిలిపివేసి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకుందామని పేర్కొన్నారు. చాలామంది మైనర్ బాలురు మోటార్ సైకిల్ తోలుతూ ప్రమాదాల గురువుతున్నారని, చిన్నారులకు మోటర్ బైక్లు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని కోరారు. ముఖ్యంగా జంక్ ఫుడ్ తింటూ పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని, వాటిని తక్షణమే నిలిపి వేసి పండ్లు, ఆకుకూరలు తినేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించే విధంగా తమ తల్లిదండ్రులకు విద్యార్థులు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు చేతుల మీదుగా పాంప్లెట్లు ఆవిష్కరించారు. వారి వెంట మెంబర్ బోయినపల్లి ప్రభావతి, ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ టెక్నికల్ ఇంజినీర్ కిషోర్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెద్దిరెడ్డి కోటిరెడ్డి పాల్గొన్నారు

ఇది తగునా?



చర్చి సెంటర్ కూడలిలో మెయిన్ రోడ్డుపై భారీ ఫ్లెక్సీలు

ఒంగోలు వన్‌టౌన్: నగరంలోని చర్చి సెంటర్ కూడలిలో మెయిన్ రోడ్డుపై ఏర్పాటు చేస్తున్న భారీ ఫ్లెక్సీలతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురి అవుతున్నారు. సెంటర్ లైట్ చుటూ 5 అడుగుల వెడల్పు, 10 అడుగులకు పైగా ఎత్తుతో 4 లేదా 5 ఫెక్సీలను గుండ్రంగా ఏర్పాటు చేస్తుండటంతో వాహనదారులకు ఎదురు వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలకు గురి అవుతున్నారు. ఈ ఫ్లెక్సీలను రోజుల తరబడి తీయడంలేదు. ఫ్లెక్సీలపై ప్రజా ప్రతినిధులు, మంత్రుల ఫొటోలు ఉండటంతో తొలగించే సాహసం అధికారులు చేయడంలేదు. నిత్యం రద్దీగా ఉండే ఈ కూడలిలో నిమిషానికి వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటారు. ఇక నైనా ఈ కూడలిలో ఫెక్సీలను ఏర్పాటు చేయకుండా అధికారులు చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న



రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

సంతనూతలపాడు: భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు ఒంగోలు ఆర్డీఓ కె.లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. మండలంలోని ఎండ్లూరు గ్రామ పంచాయతీలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి అనంతరం మాట్లాడారు. మండల స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ ఎస్.వరకుమార్ మాట్లాడారు. తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి సదస్సుకు అధ్యక్షత వహించారు. కార్యక్రమాన్ని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.రామ్ తేజ, ఎండ్లూర్ వీఆర్ఓ ఆదిరెడ్డి, సర్వేయర్ బి.శేఖర్ పర్యవేక్షించారు. రైతులు తమ భూములకు సంబంధించి సమస్యలు ఉంటే రెవెన్యూ సదస్సులో అర్జీలు దాఖలు చేసుకోవాలని ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, వరకుమార్ కోరారు. 45 రోజుల్లో రికార్డులను అనుసరించి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. సర్పంచ్ ఎస్.పుల్లయ్య, నాయకులు బొమ్మినేని రామాంజనేయులు, జె.లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి పి.రవికుమార్ పాల్గొన్నారు.

రూ.17.01 లక్షల అపరాధ రుసుం విధింపు

ఒంగోలు సబర్బన్: నగరంలోని డి–4 విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించి రూ.17.01 లక్షలు అపరాధ రుసుం విధించారు. ఈ మేరకు స్థానిక సబ్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన ఏపీ సీపీడీసీఎల్ డీఈఈ ఈఈ టి.హైమావతి వివరాలు వెల్లడించారు. మొత్తం 34 బృందాలుగా విడిపోయి నగరంలోని కమ్మపాలెం, గోపాల్ నగర్, ఇస్లాంపేట, గుంటూరు రోడ్డు, కొత్తపట్నం బస్ట్ స్టాండ్ సెంటర్, క్లాపేట, క్రిస్టియన్ పాలెం ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. విద్యుత్ చౌర్యం.. అధిక లోడ్ వినియోగిస్తున్న 363 మంది మీద కేసులు పెట్టారు. అందుకుగాను రూ.17.01 లక్షల అపరాధ రుసుం విధించినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఒంగోలు ఈఈ ఎం.హరిబాబు. డీఈఈలు పాండు రంగారావు, శ్రీకాంత్, శ్రీనివాసరావు, డి–4 సబ్ స్టేషన్ ఏఈ టి.సంతోష్ కుమార్‌తో పాటు విద్యుత్ శాఖ ఏఈఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై ఖైదీలకు అవగాహన



ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఒంగోలు టౌన్: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం, లెప్రసి సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా జైలులోని ఖైదీలకు అవగాహన కల్పించారు. అవగాహనలో భాగంగా ఖైదీలకు వ్యాసరచన , ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఎయిడ్స్, హెచ్ఐవీ, టీబీ , హైపటైటిస్ బి, సి, వ్యాధుల నుంచి దూరంగా ఉండాలని , తగిన అవగాహనతో మాత్రమే వాటినుంచి బయట పడవచ్చని జిల్లా కారాగార ఇన్‌చార్జి సూపరెండెంట్ వి. రమేష్ చెప్పారు. జిల్లా జైలులోని గ్రంథాలయంలో ఎయిడ్స్, హెచ్ఐవి, టీబీ, సుఖ వ్యాధులకు సంబంధించిన పుస్తకాలు, కరపత్రాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జిల్లా జైలు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కేఎస్‌వీఎస్ బ్రహ్మతేజ, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ కిరణ్, జైలర్ ఎం. శ్రీనివాసరావు, ఫార్మసీ ఆఫీసర్ ఎంవీ సురేష్ బాబు, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ఎంఈఎస్ ప్రత్యూష, ఎస్కే పీరు బాష, స్విర్డ్ పీఎం జి. సునిల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కషాయాలతో వ్యవసాయం చేయాలి

కొత్తపట్నం: ప్రస్తుతం వేస్తున్న శనగ, మినుము పంటలను ప్రారంభ దశ నుంచి కోత దశ వరకు ప్రకృతి కషాయాలతో సాగుబడి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. మండలంలో గాదెపాలెం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పూర్తిగా ప్రకృతి పద్ధతుల్లో వ్యవసాయం సాగుబడి చేయాలన్నారు. వీలైనంత వరకు రసాయన, పురుగు మందులు వాడకం తగ్గించుకోవాలని సూచించారు. గాదెపాలెం గ్రామంలో ప్రకృతి పద్ధతిలో సాగుచేస్తున్న చేజర్ల వెంకటసుజాత ఏటీఎం మోడల్ సందర్శించి పరిశీలించారు. సుజాత పండిస్తున్న ఈ మోడల్ ద్వారా ఇప్పటి వరకు ఎంత ఆదాయం పొందారు. మార్కెటింగ్ సదుపాయం గురించి అడిగి తెలుసుకున్నారు. వారుపూర్తి స్థాయిలో చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని అభినందించారు. ఏడీఈ రమేష్ బాబు, డీడీఏ సుబ్రహ్మణ్యం, టెక్నికల్ ఏఓ శ్రీనివాసులు నాయక్, ఏఓ ఇన్‌చార్జి అజయ్, వీఏఏ చరిత, కరీముల్లా, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది నరసింహులు, రామారావు, రాజేశ్వరి పాల్గొన్నారు.

పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలి

ఒంగోలు సిటీ: రైతులు పండించిన శనగ, మినుము, వరి పంటలకు ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ కిషోర్‌బాబు తెలిపారు. మంగళవారం ఒంగోలు మండలంలోని దేవరంపాడు, మామిడిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వరి, శనగ పంటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఓ కిషోర్‌బాబు మాట్లాడుతూ శనగ పంట నాటిన 25 రోజులకు ఒకసారి వేపనూనె లేదా వేప గింజల కషాయం రైతులు స్ప్రే చేసుకోవాలని తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. రైతులు పండించిన ప్రతి పంటను ఇ- పంట నమోదు చేసుకోవాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు రామకృష్ణారెడ్డి, ఆదిమూర్తి, వ్యవసాయ సహాయకులు కేశవ, నాగమణి, రైతులు పాల్గొన్నారు.

పంటలను నమోదు చేయించుకోవాలి

చీమకుర్తి రూరల్: రైతులు వేసుకున్న ప్రతి పంటకు ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని ఏఓ డీవీ భాస్కర్ రైతులను కోరారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇలపావులూరు, గాడిపత్రివారిపాలెంలో కంది పంటను పరిశీలించి ఆయన రైతులతో మాట్లాడారు. బ్యాంకు లోన్లు తీసుకున్న రైతులు లోను రెన్యువల్ చేసుకుని బ్యాంకు ద్వారానే ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించవచ్చన్నారు. రైతులు స్వయంగా కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రైతు ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలు, వ్యక్తిగత ఫోన్ నెంబరు, వ్యవసాయ, హార్టికల్చర్ అధికారి జారీ చేయు పంట వేసినట్లు సర్టిఫికెట్, కౌలు రైతు అయితే కౌలు కార్డు తీసుకుని వెళ్లి వివరాలు సమగ్రంగా నమోదు చేసుకుని బీమా చెల్లించాలన్నారు.

సంతనూతలపాడు: మండలంలోని గుమ్మలంపాడు, పి.తక్కెళ్లపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ పి.పావని క్షేత్ర పర్యటన చేసి గ్రామాల్లో సాగు చేసిన వరి, మినుము, కంది పంటలను పరిశీలించి రైతులకు సస్యరక్షణ చర్యలు వివరించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ఎస్.వెంకటరావు, కేవీ సుబ్బారెడ్డి, గుమ్మలంపాడు, పి.తక్కెళ్లపాడు గ్రామ వ్యవసాయ సహాయకులు ఎ.రవికుమార్, షేక్ అబ్దుల్ పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: రైతులు సాగు చేసే ప్రతి పంటకు బీమా తప్పకుండా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకట్రావు అన్నారు. బుధవారం మండలంలోని చదలవాడ, చేకూరపాడు గ్రామాల్లో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల అధికారులతో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి రైతు రబీలో వేసిన పంటలకు పంటల బీమా చేయించుకోవాలని కోరారు. ఉద్యానవన అధికారి ప్రత్యూష మాట్లాడుతూ రైతుల అవసరం మేరకు రాయితీపై మినీ ట్రాక్టర్లు తదితర పనిముట్లు అందజేస్తారని పేర్కొన్నారు. సర్పంచ్ రమేష్ బాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సత్య సాయి బాబా స్కూల్‌కు విరాళం



సత్య సాయి బాబా స్కూలుకు విరాళాలు

ఒంగోలు మెట్రో: మానవతావాది సేవా తత్పురుషులు సంతనూతలపాడు నివాసి అమెరికాలో ఉంటున్న ఎన్నారై సూదన గుంట రాఘవేంద్ర ప్రసాద్ ఒంగోలులోని భగవాన్ సత్యసాయి బాబా మందిరంలో ఉన్న పేద విద్యార్థుల స్కూల్ నిమిత్తం రెండు రూములు నిర్మించడానికి అంగీకరించారు. భగవాన్ సత్య సాయి బాబా స్కూలు కమిటీకి మొత్తం 19 లక్షల విలువైన రెండు చెక్కులు అందజేశారని మందిర కన్వీనర్ కోడెల శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. డాక్టర్ శ్రీమన్నారాయణ వీసీహెచ్ సుబ్బారావు సిద్ధ సాయిబాబు చంద్రశేఖర్ రెడ్డి సుబ్బారావు మంత్రి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

నేటి నుంచి సమ్మెటివ్ పరీక్షలు

- 11 నుంచి 19 వరకు పరీక్షల నిర్వహణ

ఒంగోలు సిటీ: విద్యార్థుల తరగతుల వారీగా అభ్యసనా సామర్థ్యాల మదింపునకు విద్యాశాఖ ప్రతి సంవత్సరం నాలుగు ఫార్మేటివ్, రెండు సమ్మెటివ్ పరీక్షలను నిర్వహిస్తుంది. ప్రస్తుతం రెండు నెలలకొకసారి నిర్వహించే ఫార్మేటివ్ పరీక్షలను సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షలుగా పేరు మార్చారు. ఇప్పటికే రెండు నిర్వహించారు. ఐదు నెలలకొకసారి నిర్వహించే సమ్మెటివ్ పరీక్ష 1 అక్టోబరు చివరి వారంలో లేదా నవంబరు మొదటి వారంలో నిర్వహించాలి. కాగా ఈ నెల 11వ తేది నుంచి 19వ తేది వరకు జరపాలని ఎస్‌సీఈఆర్టీ షెడ్యుల్ ను విడుదల చేసింది.



పాఠశాలలోని విద్యార్థులు

సెల్ఫ్ అసెస్మెంట్ మోడల్ పేపరుగా (సాంప్) పేరు మార్పు

ఐదు నెలలకొకసారి నిర్వహించే పరీక్షలను సమ్మెటివ్ 1,2 పరీక్షలుగా పిలుస్తున్నారు. ఇక నుంచి సమ్మెటివ్ పరీక్షలను సెల్ఫ్ అసెస్మెంట్ మోడల్ పేపరుగా పేరు మార్చారు. ఇప్పటికే ఫార్మేటివ్ పరీక్షలను సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షలుగా మార్చారు. ఈ ప్రశ్న పత్రాలను జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం (డీసీఈబీ) ద్వారా ఎంఆర్సీలకు అక్కడి నుంచి పాఠశాలలకు పంపిణీ చేస్తారు. ప్రశ్నపత్రాలను పరీక్ష జరిగే గంట ముందు ఇస్తుండటంతో వాటిని పాఠశాలలకు చేర్చడంలో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

పబ్లిక్ పరీక్షల మాదిరిగా సమ్మెటివ్ పరీక్షలు



పబ్లిక్ పరీక్షల మాదిరిగా సమ్మెటివ్ పరీక్షలు నిర్వహించాలి. ఎటువంటి లోపాలు జరగకుండా పరీక్షలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం. పరీక్ష జరిగే గంట ముందు వెళ్ళి ఆయా మండల విద్యాకేంద్రం నుంచి ప్రశ్నపత్రాలు తీసుకెళ్లాలి.

అత్తోట కిరణ్‌కుమార్, డీఈఓ

అంగలకుర్తి ప్రసాద్‌కు ఆత్మీయ సన్మానం



అంగలకుర్తి ప్రసాదును సత్కరిస్తున్న కళాకారులు

ఒంగోలు మెట్రో: టీటీడీ గరుడ అవార్డు గ్రహిత, భారతీయం కళార్చన ఉత్తమ నటుడు, జిల్లా రంగ భూమి కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాదు ఆత్మీయ సన్మానం అందుకున్నారు. పద్మశ్రీ ఘంటసాల వి. రామకృష్ణ సాంస్కృతిక సేవా సంస్థ 34వ కార్యక్రమాలు స్థానిక సీవీఎన్ రీడింగ్ రూంలో నిర్వహించారు. సినీ సంగీత విభావరి కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు, శ్రీకృష్ణ దేవరాయ సేవా సమితి అధ్యక్షుడు మద్దెల నరసింహారావు, అంగకుర్తి ప్రసాద్కు ఘన సన్మానం చేశారు. విశ్రాంతి అధ్యాపకుడు నరసింహారావు, జిల్లా సంగీత కళాకారుల సమైక్య అధ్యక్షుడు అనంతలక్ష్మి, వాకా సంజీవరెడ్డి, వీరాంజనేయ మాకా అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



కేక్ కట్ చేస్తున్న పాస్టర్ డీజే అగస్టీన్

ఒంగోలు మెట్రో: ఒంగోలు జేఎంబీ చర్చ్ ఆవరణంలో సండే స్కూల్ ఆధ్వర్యంలో టీచర్స్ క్రిస్మస్ సందర్భంగా జరిగిన వివిధ రకాల ఆటలు.. బైబిల్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సండే స్కూల్ యాజమాన్యం జాన్ ఆశీర్వాదం, ఎం. సత్యకుమారి గ్లాడిస్టన్, ఐ. లిల్లీ మోసెస్ నిర్వాహణలో ఈ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. పాస్టర్ డీజే ఆగస్టీన్ పాస్టర్ ఆషేర్ పాల్ సుమతి, పవిత్రన్ పాల్గొన్నారు. అలాగే ఏబీఎం జూనియర్ కాలేజీ హై స్కూలులో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. హైస్కూలు కరస్పాండెంట్ కొమ్మూరి రవిచంద్ర మాట్లాడుతూ క్రీస్తు పుట్టుకకు చారిత్రక ఆధారాలున్నాయన్నారు. ముందుగా పాస్టర్ కె డేనియెల్ వాక్యపరిచర్య చేసినారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పుష్పరాజు, ప్రిన్సిపాల్ డి. శ్రీవాణి, కె. విధుల్లత, కె. నిర్మల పాల్గొన్నారు.

మెప్మా కార్యాలయానికి గడియారాలు అందజేత

చీమకుర్తి: స్థానిక మెప్మా కార్యాలయానికి అభయ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు మంగళవారం గడియారాలు అందించారు. తన కుమారుడు పవన్‌కుమార్ జ్ఞాపకార్థం అందించినట్లు ఆయన పేర్కొన్నారు. మెప్మా సిబ్బంది మాధవరావుకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.